క్లుప్తంగా

అంగన్‌వాడీ కార్యకర్తల ర్యాలీ



నూజివీడు: ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడులో శనివారం ఐసీడీఎస్ నూజివీడు ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. మన అంగన్‌వాడీ పిలుస్తోంది అనే కార్యక్రమంలో భాగంగా ఐదేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని, వారి సమగ్రాభివృద్ధికి తల్లిదండ్రులు తోడ్పాటును అందించాలంటూ ర్యాలీ పొడవునా అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ప్రీస్కూల్ కిట్‌ను అందజేస్తామని, ఆటపాటలతో కూడిన విద్యను అందించడం ద్వారా పిల్లల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన మట్టి వివాదం

మూలపాడు(ఇబ్రహీంపట్నం): ఇరువర్గాల మధ్య చెలరేగిన స్థలం వివాదం పోలీస్ స్టేషన్‌కు శనివారం చేరింది. గ్రామానికి చెందిన అబ్బూరి పిచ్చేశ్వరరావు తన ఇంటి పక్కన స్థలం గోడకు ఆనించి మట్టి తోలుకున్నాడు. ఆ స్థలం గ్రామానికి చెందిన గరికపాటి శివ బాబాయిది కావడంతో అక్కడ తోలిన మట్టిన జేసీబీతో ట్రాక్టర్ ద్వారా శివాలయం వద్దకు తరలించారు. దీంతో తన మట్టిని తరలించుకుపోయారని అబ్బూరి పిచ్చేశ్వరరావు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. సీఐ పి.శ్రీను స్థలం పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో వివాదంలో ఉన్న ఈ స్థలాన్ని గ్రామ పెద్దలు ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చి గోడను కూడా కట్టించారు.

పలు హైస్కూళ్ల హెచ్‌ఎంల బదిలీ

నూజివీడు: మండలంలోని పలు హైస్కూళ్ల హెచ్‌ఎంలు బదిలీకాగా, వారి స్థానంలో మరి కొందరు నూతన హెచ్‌ఎంలు వచ్చారు. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ హెచ్‌ఎం మండలంలోని యనమదల హైస్కూల్‌కు బదిలీ కాగా, పెనమలూరు మండలం చోడవరం హైస్కూల్ హెచ్‌ఎం వీవీఎస్ సత్యనారాయణ బాలికల హైస్కూల్ హెచ్‌ఎంగా బదిలీ అయ్యారు. యనమదల హైస్కూల్ హెచ్‌ఎం జీ విజయకుమారి మండలంలోని అన్నవరం హైస్కూల్‌కు బదిలీ కాగా, అక్కడి హెచ్‌ఎం వరలక్ష్మి రెడ్డిగూడెం మండలం నాగులూరు హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. కోటవారిగూడెం హైస్కూల్ హెచ్‌ఎంగా ఆగిరిపల్లి ఈదర హైస్కూల్ హెచ్‌ఎం కే లక్ష్మీసుజాత బదిలీ అయ్యారు. దేవరగుంట హైస్కూల్ హెచ్‌ఎంగా కై కలూరు మండలం దొడ్డిపట్ల హైస్కూల్ హెచ్‌ఎం డీ సుబ్బారావు బదిలీ అయ్యారు. పల్లెర్లమూడి హైస్కూల్ హెచ్‌ఎంగా ముసునూరు మండలం గోపవరం హైస్కూల్ హెచ్‌ఎం హనుమంతరావుబదిలీ అయ్యారు.

కొండపల్లి ఐడీఏలో డెకరేషన్ దుకాణం దగ్ధం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి పారిశ్రామిక వాడలో శనివారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. విజయవాడకు చెందిన మణికంఠ డెకరేషన్ దుకాణం ఎదుట కంపెనీ సిబ్బంది చెత్త తగులపెట్టే క్రమంలో అనూహ్యంగా మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడ్డాయి. క్షణాల వ్యవధిలో దుకాణంకు అలుముకున్నాయి. కళ్లెదుటే షాపులోని సామగ్రి కాలిబూడిద అయ్యాయి. సమాచారం అందుకున్న ఐడీఏలోని అగ్నిమాపక వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లినట్టు బాధితుడు తెలిపారు. ప్రమాదంలో పరిసర ప్రాంతాల పరిశ్రమలకు మంటలు వ్యాపించకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

ముళ్ల చెట్ల తొలగింపు



చెట్లను తొలగిస్తున్న జేసీబీ

చాట్రాయి: మండలంలోని కొత్తగూడెం నుంచి సూరేపల్లి వెళ్లే రోడ్డుకి ఇరువైపులా గుబురుగా ముళ్ల చెట్లు పెరగడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని మరియమాత విగ్రహం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాలంటే నరక యాతన పడుతున్నారు. దీంతో సర్పంచ్ చల్లగుళ్ల వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో రోడ్డుకి ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలను శనివారం పొక్లెయిన్‌తో తొలగించారు. ముళ్ల చెట్ల తొలగించడంపై రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్న సీఎం జగన్

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన మాటకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని, ఉద్యోగుల సమస్యల పరిష్కరించేందుకు ఆయన చిత్తశుద్ధితో ఉన్నారని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారా మెడికల్ సిబ్బంది శనివారం హర్షం వ్యక్తం చేశారు. మైలవరం శాసన సభ్యుడి కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి కాంట్రాక్టు పారా మెడికల్ సిబ్బందితో కలసి స్థానిక ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించారని పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలు తమ సుదీర్ఘ కలను నెరవేరుస్తున్న సీఎం జగన్‌కు కాంట్రాక్టు ఉద్యోగులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువతో సత్కరించారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత

విద్యార్థి ఉన్నత విద్యకు ఆర్థిక చేయూత

మైలవరం: మండలంలోని వెల్వడం గ్రామానికి చెందిన విద్యార్థి ప్రత్తిపాటి సంజీవరావు జోధ్‌పూర్ ఐఐటీలో ఆస్ట్రో ఫిజిక్స్ అనే అంశంపై పీహెచ్‌డీ చేస్తున్నాడు. వెల్వడం వైఎస్సార్ సీపీ నాయకుడు యరమల రామ్‌భూపాల్‌రెడ్డి సంజీవరావు ప్రతిభను గుర్తించి, అతడి ప్రథమ సంవత్సరం ఫీజు, ఇతర ఫీజులకు సంబంధించి తన వంతు ఆర్థిక సహాయం ప్రకటించారు. మైలవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థికి ఆ మొత్తాన్ని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ద్వారా శనివారం అందజేశారు.

నకిలీ విత్తన విక్రయాలను సహించం

ఎమ్మెల్యే కే రక్షణనిధి

తిరువూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాల సరఫరాకు వ్యవసాయ, ఉద్యానవన అధికారులు చర్యలు తీసుకోవాలని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి ఆదేశించారు. స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యానవన అధికారులు, రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. మిర్చి నారు అమ్మకాలకు తిరువూరు నియోజకవర్గంలో అనుమతి లేని నర్సరీలు ఏర్పాటైనట్లు రైతులు ఫిర్యాదు చేశారన్నారు. ఇటువంటి నర్సరీలను ముందుగానే నియంత్రించాలని ఎమ్మెల్యే సూచించారు. భూసార పరీక్షల నిర్వహణ, విత్తన ఎంపిక, విత్తన నాణ్యత పరిశీలన, పంట మార్పిడి, ఎరువులు, పురుగుమందుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, ఈ-క్రాప్ నమోదు, వరి, మిర్చి, పత్తి తదితర పంటల మార్కెటింగ్ తదితర అంశాలపై రైతులకు గ్రామస్థాయిలో అవగాహన సమావేశాలు నిర్వహించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

నాసిరకం విత్తనాల కారణంగా నష్టపోయామని రైతులు ఫిర్యాదు చేస్తే సహించబోమని కూడా తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, తిరువూరు, విస్సన్నపేట జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, లోకేశ్వరరెడ్డి, ఉద్యానవన జిల్లా అధికారి బాలాజీ, తిరువూరు వ్యవసాయ సహాయ సంచాలకులు కెనడీ, తిరువూరు, విస్సన్నపేట, ఏకొండూరు, గంపలగూడెం మండలాల వ్యవసాయాధికారులు, రైతు భరోసా కేంద్రాల ఉద్యానవన, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలకు చేరిన పాఠ్య పుస్తకాలు

మైలవరం: మైలవరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇచ్చే పాఠ్యపుస్తకాలు, విద్యా కిట్లు శనివారం చేరుకున్నాయి. స్థానికంగా భద్రపరచిన కార్యాలయం నుంచి జగనన్న విద్యా కానుక కిట్లు ఆయా పాఠశాలలకు వాహనాల్లో పంపించారు. ఈ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు సంబంధించి పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్ దుస్తులు, షూస్, సాక్స్ తదితరాలు పాఠశాలలకు తరలించారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పూజలు అందుకుంటున్న ఉత్సవమూర్తులు

ఇబ్రహీంపట్నం: స్థానిక ఏకాలనీలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహ వచనం, వసంతోత్సవంతో పాటు ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఏపీ జెన్‌కో డైరెక్టర్ ఎంవీవీ సత్యనారాయణ, భారతి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

పాత నేరస్తులకు ప్రత్యామ్నాయ ఉపాధి

తిరువూరు: సారా తయారీ, అమ్మకాలపై ఆధారపడిన వారు ఆ వృత్తి మానేస్తే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఎస్‌ఈబీ స్టేషన్ ఆవరణలో శనివారం సారా కేసుల్లో పట్టుబడి ఆ వృత్తికి స్వస్తి పలికిన 13 మందికి స్వయం ఉపాధి పథకాల కింద కుట్టు మిషన్లు, కర్రీ పాయింట్ నిర్వహణ సామగ్రిని పంపిణీ చేశారు. బ్యాంకుల ద్వారా మంజూరు చేసిన రూ.50వేల నుంచి రూ.2లక్షల వరకు రుణాల పంపిణీ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చట్టవ్యతిరేక పనులు చేసేవారు



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న అధికారులు

ఇబ్బందులు పడక తప్పదన్నారు. కష్టపడి పనిచేసుకునే వారికే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. తిరువూరు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ గురవయ్య, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

50 మందికి కళ్లజోళ్లు పంపిణీ



ముసునూరు: కంప్యూటరైజ్డ్ నేత్ర పరీక్షల ద్వారా దృష్టిలోపం ఉన్నవారిని 50 మందిని గుర్తించి వారికి శనివారం ఉచితంగా కళ్లజోళ్లు, మందులు అందజేసినట్లు ఆర్గనైజర్ కె.చినసోమయ్య తెలిపారు. మండలంలోని గోపవరం ఆర్‌సీఎం చర్చి వద్ద హనుమాన్ జంక్షన్‌కు చెందిన సరిత నేత్ర వైద్యాలయ బృందం ఆధ్వర్యంలో ఇటీవల ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ నేత్ర వైద్య నిపుణుడు డా.సుధీర్ బృందం 100 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి, 50 మందికి కళ్లజోళ్లు, 15 మందికి వృద్ధులకు శుక్లాల ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. కళ్లజోళ్లు అవసరమని గుర్తించిన 50 మందికి శనివారం కళ్లజోళ్లు పంపిణీ చేశారు.

మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలిగా పద్మావతి

ముసునూరు: మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలిగా తాను ఎన్నికైనట్లు, ముసునూరు జాగృతి మండల సమాఖ్య అధ్యక్షురాలు, చింతలవల్లికి చెందిన దువ్వూరి పద్మావతి తెలిపారు. శుక్రవారం ఏలూరులోని డీటీడీసీ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికలో ముసునూరు మండల సమాఖ్య అధ్యక్షురాలిగా ఉన్న తనను, జిల్లా అధ్యక్షురాలిగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఏడాది పాటు కొనసాగనున్న ఈ పదవితో అధిక సంఖ్యలో రుణాలు మంజూరు చేయించడం ద్వారా మహిళల అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె శనివారం తెలిపారు.



పద్మావతి

జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా ఎన్నికైన ఆమెను నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్, ఎంపీపీ కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, మండల పార్టీ అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ సుధాకర్, సొసైటీ అధ్యక్షుడు నాగళ్ల వెంకటేశ్వరరావు అభినందించారు.

వైభవంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ట

జి.కొండూరు: మండలంలోని వెలగలేరు గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్టా మహోత్సవం శనివారం కనులపండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ హాజరయ్యారు. శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహించిన స్వామి జీవ ధ్వజము, గరుడాళ్వారు పునఃప్రతిష్టామహోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.



ధ్వజస్తంభ పునఃప్రతిష్టా కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

తాళం వేసిన ఇంట్లో చోరీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఖిల్లారోడ్డులో తాళం వేసిఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ చోరీలో ఒక ల్యాప్‌ట్యాప్, రెండు స్మార్ట్ సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. ఇంటి యాజమానురాలు జీ రామసీత తన కుమారుడు శ్రీనివాస్‌తో కలసి బంధువుల ఇంటికి వెళ్లరు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చే సమయానికి తాళం కోసి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా ల్యాప్ ట్యాప్, రెండు సెల్‌ఫోన్స్ చోరీకి గురైనట్లు గుర్తించారు. రామసీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో విజయవాడ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో నిందితులు ఉన్నట్లు గుర్తించారు. త్వరలో కేసు ఛేదిస్తామని సీఐ పి.శ్రీను తెలిపారు.

చికిత్స పొందుతూ కాపు సంఘ నేత మృతి

నూజివీడు: పట్టణానికి చెందిన కాపు సంఘం నేత, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము తండ్రి వెంకటేశ్వరరావు(83) విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఏప్రిల్ 12న పట్టణంలోని సెగ్గాపేటకు చెందిన బొక్కా వెంకటేశ్వరరావు అనే వ్యక్తి శీలం వెంకటేశ్వరరావుపై దాడి చేసి, తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఆయన చనిపోయారు. ఈ నేపథ్యంలో నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఆయన తనయుడు మేకా వెణుగోపాల అప్పారావు(చంటినాయన), మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.



వెంకటేశ్వరరావు మృతదేహం

పైడిమర్రికి ఘన నివాళి

తిరువూరు: భారతదేశం నా మాతృభూమి ప్రతిజ్ఞా రచయిత పైడిమర్రి వెంకటసుబ్బారావు జయంతి కార్యక్రమం స్థానిక నాగార్జున జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ప్రజల్లో దేశభక్తి, సోదరభావం పెంపొందించడానికి పైడిమర్రి ప్రతిజ్ఞ రచించారని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాక రఘునందన్ అన్నారు. పైడిమర్రి జీవిత విశేషాలను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి రాంప్రదీప్ సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ కే శేషగిరిరావు, అధ్యాపకులు పైడిమర్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పైడిమర్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

మోదీ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి



నూజివీడు: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధిలో ముందంజలో ఉందని ఏలూరు పార్లమెంట్ కన్వీనర్, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపన చౌదరి) అన్నారు. నూజివీడులోని మాటూరి హోటల్ కన్వెన్షన్ హాల్లో శనివారం పట్టణంలోని వ్యాపారులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు పార్లమెంట్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలోనూ పర్యటిస్తూ స్థానిక సమస్యలు తెలుసుకోవడంతో పాటు వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నానన్నారు. మోదీ తొమ్మిదేళ్ల పాలన ప్రచార కార్యక్రమాల గోదావరి జోనల్ ఇన్‌చార్జిగా బాధ్యత నిర్వహిస్తున్నామన్నారు. తపన ఫౌండేషన్ స్థాపించి 15 ఏళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. తపన ఫౌండేషన్ ద్వారా జిల్లాలోని నీటి ఎద్దడి ప్రాంతాల్లో 20కి పైగా వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నామన్నారు. సమావేశంలో బీజేపీ నూజివీడు రూరల్ మండల అధ్యక్షుడు గోగినేని అప్పారావు, పట్టణ అధ్యక్షుడు దోసపాటి జానర్దన్‌రావు, నాయకులు వైఎస్ దొరై, మాటూరి ప్రసాద్, అనుమోలు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యం

ఎమ్మెల్యే రక్షణనిధి

ఊటుకూరు(గంపలగూడెం): పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు సంవత్సరాలుగా పరిపాలన సాగిస్తున్నారని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండలం ఊటుకూరు–1 సచివాలయం పరిధిలో రెండో రోజు శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పార్టీ శ్రేణులు వెంటరాగా గ్రామంలో దక్షిణ దళితవాడ, సినిమాహాలు రోడ్డు, ప్రధాన వీధి, రజకపేట, ముస్లింబజార్లలో తిరుగుతూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు ఏ విధంగా అందుతున్నదీ అడిగి తెలుసుకున్నారు. పాదయాత్రలో ప్రజా సమస్యలను తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అమల్లోకి తెచ్చిన నవరత్నాలు, ఇతర పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఆయా పథకాల ద్వారా సంబంధిత కుటుంబ సభ్యులకు అందిన ప్రయోజనాలను వివరించడంతోపాటు ముద్రించిన బ్రోచర్లను అందజేశారు. అర్హత ఉండి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే 2024 సాధారణ ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓటర్లు బలపర్చాలని కోరారు. ముత్యాలమ్మ గుడి బజారు వద్ద ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ స్తంభం విషయమై గ్రామస్తులు ఆయన దృష్టికి తేగా... వెంటనే తొలగించి కొత్తస్తంభం ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ ఏఈ కొమ్ము వాసును ఆదేశించారు. కాలనీ గృహాలు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. ఊటుకూరు సొసైటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ఆలపాటి ఉమామహేశ్వరరావు, ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్, ఎంపీటీసీ సభ్యురాలు సునీత, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఉపసర్పంచ్ రాఘవయ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.



ఊటుకూరులో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కే రక్షణనిధి

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ముసునూరు: ఈ ఏడాది ఫిబ్రవరి 15న విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో రెండు నివాస గృహాలు దగ్ధమై, ఓ వ్యక్తి సజీవ దహనమైన ఘటనలో బాధిత కుటుంబాలకు నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో గుళ్లపూడి దళితవాడలోని బాధిత పిల్లి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు కుటుంబాలను శనివారం ఆయన పరామర్శించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన పార్టీ కార్యకర్త పల్లి ధర్మారావును పరామర్శించారు. ఇటీవల గుండె సంబంధిత శస్త్ర చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న చింతలవల్లి సర్పంచ్ పిల్లి సత్యనారాయణను ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. అనారోగ్యానికి గురై కోలుకుంటున్న కొర్లగుంట ఎంపీటీసీ వన్నెకూటి సుందరరావును పరామర్శించారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ రాజానాయన, సర్పంచ్‌లు శ్రీదేవి శ్రీనివాస్, ఎస్ సత్యనారాయణ, ఉప సర్పంచ్ పద్మజా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

నూజివీడు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ ఎంఈఓ వంగల గోవిందరావు అన్నారు. పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో పిల్లలపై సెల్‌ఫోన్లు, టీవీల ప్రభావంఎక్కువగా ఉందన్నారు. సెల్‌ఫోన్ల వల్ల విద్యార్థులకు ఉపయోగాలకంటే నష్టాలే ఎక్కువగా ఉన్నాయన్నారు. విద్యార్థులు సెలవురోజుల్లో తప్పనిసరిగా గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలను చదవాలన్నారు. గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు, సిబ్బంది యశ్వంత్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

తిరువూరు: స్థానిక గ్రేడ్–1 గ్రంథాలయంలో గత నెల రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. చిత్రలేఖనం, తెలుగు, ఇంగ్లిష్, గ్రామర్, పద్యపఠనం, చదరంగం తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చినట్లు గ్రంథాలయాధికారి పద్మావతి తెలిపారు. మొత్తం 25 అంశాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఆదివారం జరిగే ముగింపు కార్యక్రమంలో బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.



గోపవరంలో నీతి కథలు చదువుతున్న చిన్నారులు

నీతి కథలతో నైతిక విలువలు

ముసునూరు: నీతి కథల అధ్యయనంతో నైతిక విలువలు అలవడతాయని, గ్రంథాలయానికి వెళ్లి నీతి కథల పుస్తకాలు చదవాలని చిన్నారులకు పెద్దలు సూచించారు. గోపవరం గ్రంథాలయంలో బ్రాంచి అధికారి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో 34వ రోజు శనివారం నీతి కథల ప్రాధాన్యాన్ని చిన్నారులకు వివరించారు.

గంజాయి ప్యాకెట్లతో ఉన్న ముగ్గురి అరెస్టు

విస్సన్నపేట: గంజాయి ప్యాకెట్లు కలిగి ఉన్న 17 నుంచి 20 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక రెడ్డిగూడెం రోడ్డులో వైన్‌షాపు పక్కన ఖాళీ స్థలంలో అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా అటుగా వెళుతున్న ఎస్ఐ జీవీవీ సత్యనారాయణ, సిబ్బంది వారిని శనివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఏసీపీ ఎం.రమేష్ శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. విస్సన్నపేటకు చెందిన పోలిమెట్ల సుభాష్, పరసం వేణుసాయి, గంట అరుణ్‌తేజను అదుపులోకి తీసుకుని వారి వద్ద 1,100 గ్రాములు గల మూడు గంజాయి పొట్లాలు, ఒక బైక్ స్వాధీన పర్చుకున్నారు. సుభాష్ స్నేహితుడు రెడ్డిగూడెం మండలం ముచ్చెనపల్లి గ్రామానికి చెందిన గంట జీవన్ అనే అతని ద్వారా అప్పుడప్పుడు గంజాయి కొనుగోలు చేస్తున్నారు. అతను అందుబాటులో లేకపోతే అతని బాబాయి కొడుకు అరుణ్‌తేజ గంజాయి తెచ్చి ఇచ్చేవాడని, ఇదే క్రమంలో ఈ రోజు ఉదయం సుభాష్, వేణుసాయి గంజాయి కావాలని జీవన్‌ను అడగగా అతను రెడ్డిగూడెం మండలం ముచ్చెనపల్లి గ్రామం వెళ్లే ఊరి బయట కాలువ దగ్గరకు రమ్మని చెప్పగా బైక్‌పై వెళ్లారన్నారు. అక్కడకు జీవన్, అరుణ్‌తేజ వచ్చి మూడు ప్యాకెట్లు గంజాయి ఇచ్చారు. అనంతరం జీవన్ వెళ్లిపోగా, అరుణ్‌తేజ వీరిద్దరితో కలసి విస్సన్నపేటలోని రెడ్డిగూడెం రోడ్డులో గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లు చేసి అమ్ముకుందామని ఆలోచిస్తుండగా వారిని అరెస్టు చేసినట్టు ఏసీపీ తెలిపారు. జీవన్ పరారీలో ఉన్నాడని త్వరలో పట్టుకుంటామని పేర్కొన్నారు. యువత మత్తుపదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయికి అలవాటు పడ్డవారిని గుర్తించి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. గంజాయితో యువకులను పట్టుకున్న ఎస్ఐ జీవీవీ సత్యనారాయణకు, సిబ్బందిని ఏసీపీ అభినందించి రివార్డులు ఇచ్చారు. సమావేశంలో సీఐ ఆర్.భీమరాజు పాల్గొన్నారు.



గంజాయితో పట్టుబడిన వ్యక్తుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమేష్



పట్టుబడిన గంజాయి